క్లుప్తంగా

రాజగోపుర నిర్మాణానికి విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి గురువారం భక్తులు విరాళం అందజేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ మాట్లాడుతూ గుడికల్ గ్రామానికి చెందిన ఉలిగయ్య, నారాయణ కుటుంబ సభ్యులు రూ.1,01,120 దేవాలయ కార్యాలయంలో అందజేశారన్నారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి తీర్థప్రసాదాలను, పూలమాల, శేష వస్త్రం, బాండు అందజేశారు. ఆలయ ముఖ్య అర్చకుడు నాగరాజ్‌స్వామి పాల్గొన్నారు.

21న ఆరాధనోత్సవాలు

కౌతాళం: మండలంలోని సుళేకేరి గ్రామంలో వెలసిన వెంకావదూత ఆరాధనోత్సవం ఈనెల 21వ తేదీన వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మఠం నిర్వహకుడు నాగేంద్ర ఆచార్యస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వెంకావదూత 18వ ఆరాధనోత్సవాన్ని ప్రతి ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉత్సవానికి చుట్టూ పక్కల గ్రామాల ప్రజలే కాకుండా కర్ణాటక నుంచి అధికంగా భక్తులు తరలివస్తారని, వారికి అనుగుణంగా ఏర్పాట్లు చేశామన్నారు. ధ్వజారోహణం, గురుపూజ, అభిషేకం, బిల్వపత్రి అర్చనతో పాటు సాయంత్రం పల్లకోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ టోర్నీ విజేత కోసిగి



విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

కోసిగి: మండలంలోని చింతకుంట గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి సహకారంతో జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నీ విజేతగా కోసిగి మారుతి జట్టు నిలిచింది. గురువారం కోసిగి మారుతి జట్టు, చింతకుంట చింతలముని స్వామి జట్టు తలపడగా కోసిగి జట్టు గెలుపొందింది. ప్రథమ బహుమతి రూ.10,116, ద్వితీయ బహుమతి రూ.5,116, తృతీయ బహుమతి కోసిగి హనుమాన్ జట్టుకు రూ.3,116 నగదును వైఎస్సార్ సీపీ నాయకులు ఈరన్న, నరసింహులు అందజేశారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

కౌతాళం: కులగణనన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో కులగణనన సర్వేను పకడ్బందీగా నిర్వహించడానికి అందరు సిద్ధంగా ఉండాలన్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే సర్వేను మండలంలో కులాల వారిగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఏఎస్‌ఓలు హేమంతకుమార్, కౌసర్, పరిపాలన అధికారి సత్యన్న, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖాదర్‌లింగస్వామికి ప్రత్యేక పూజలు



సమాధిపై పూలమాల వేస్తున్న దృశ్యం

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. కొందరు భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యంగా నివేదించారు.

రేపు రథోత్సవం

పత్తికొండ రూరల్: పత్తికొండ–హోసూరు గ్రామాల మధ్య నరసింహస్వామి తోటలో కొలువుదీరిన మహాత్మాయోగి నరసింహ స్వామి రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. వేడుకకు ఏర్పాట్లు చేస్తున్నారు. 19న ఆరాధన సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, రథాంగహోమం, రథోత్సవ కలశస్థాపన, 20న మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి రథోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తాం



మహిళకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: పట్టణంలోని అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మురికివాడలు, శివారు ప్రాంతాలు, దళితవాడల్లో మౌలిక వసతులు కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. పట్టణంలోని 32వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కౌన్సిలర్ కీర్తన, ఇన్‌చార్జి కిషోర్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్‌లు మంజుల, రేణుక, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, కార్యకర్తలు, నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి పథకాలను వివరించి బుక్‌లెట్ అందజేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పొదుపు మహిళలను లక్షాధికారిగా చూడాలని ప్రభుత్వం వడ్డీలేని రుణాలను బ్యాంకు లింకేజీ ద్వారా, జగనన్న చేయూత ద్వారా రుణాలు అందిస్తోందన్నారు. ప్రజా సంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతిఒక్క హామీని అమలు చేసి ప్రజల ఆశీస్సులు పొందారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, వైస్ చైర్మన్ నరసింహులు, మండల యూత్ అధ్యక్షుడు నల్లారెడ్డి, కౌన్సిలర్లు రామలింగేశ్వరయాదవ్, తాయన్న, ఫయాజ్‌అహ్మద్, సందీప్‌రెడ్డి, అమాన్, నాయకులు రఫీ, చిన్న ఈరన్న, శ్రీను, నాగరాజు, కల్పవల్లి, హరి, అధికారులు పాల్గొన్నారు.

కమీషన్ వ్యాపారులకు నోటీసులు

- ఆదోని మార్కెట్ యార్డ్‌లో లైసెన్స్ రెన్యూవల్ చేయించుకోని కమీషన్ ఏజెంట్లు
- ఐదేళ్లకొకసారి తప్పనిసరంటున్న అధికారులు
- కాలపరిమితిలో రెండేళ్లు క్రయవిక్రయాలు జరపాలని నిబంధన



వ్యాపారులకు ఇచ్చిన నోటీసు

ఆదోని అర్బన్: స్థానిక మార్కెట్ యార్డులోనున్న కమిషన్ ఏజెంట్లకు యార్డు అధికారులు నోటీసులు జారీ చేశారు. సాధారణంగా ఐదేళ్లకొకసారి లైసెన్స్ రెన్యూవల్ చేయించుకోవాలి. అలాగే ఆ ఐదేళ్లలో రెండేళ్ల పాటు వ్యాపార లావాదేవీలు నిర్వహించి ఉండాలి. అలా చేయకపోతే లైసెన్స్ రద్దవుతుంది. అయితే ఏజెంట్లు రెన్యూవల్ చేయించుకోకపోవడంతో అధికారులు గతేడాది నవంబర్‌లో నోటీసులు పంపారు.

లావాదేవీలు తప్పనిసరి..

రైతులు తెచ్చిన పంట దిగుబడులను క్రయ, విక్రయాలు జరిపేందుకు వ్యవసాయ మార్కెట్‌యార్డులో అధికారులు కమీషన్ ఏజెంట్లకు ఐదేళ్లకాల పరిమితితో లైసెన్సులు ఇస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు లైసెన్సుదారులు కనీసం రెండు సంవత్సరాలైనా లావాదేవీలు చేస్తే ఆ కాల పరిమితిలోపు మళ్లీ రెన్యూవల్ చేస్తారు. ఇలా రెండేళ్లు లావాదేవీలు చేయకపోతే లైసెన్సులు రద్దు అవుతాయని నిబంధనలు పేర్కొంటున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇలా దాదాపు 150 మంది రెన్యూవల్ చేయించుకోలేదని తెలుస్తుంది. వీరిలో కేవలం 14 మంది మాత్రమే రెన్యూవల్‌కు ముందుకొచ్చారు. కాగా వ్యాపారులు ఇందుకు భిన్నంగా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రెన్యూవల్ గడువుకు రెండు నెలల ముందే తమకు నోటీసులు ఇవ్వాల్సి ఉందని, అలా కాకుండా ఏడు నెలల తరువాత అంటే మార్చిలో నోటీసులు ఇవ్వాల్సి ఉండగా నవంబర్ ఇస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. వారి చర్యల కారణంగా తమ లైసెన్స్ రద్దయ్యే అవకాశమేర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018 మార్చిలో కొందరు కొత్త కమిషన్ ఏజెంట్లకు లైసెన్స్ మంజూరు చేశారు. అలాగే మరికొందరికి రెన్యూవల్ చేశారు. వీరంతా 2023మార్చిలో రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉండగా అధికారులు నవంబర్‌లో నోటీసులిచ్చారు. కాగా ఒక్కో లైసెన్స్ రెన్యూవల్‌కు రూ.10వేల వరకు ఖర్చవుతుంది.

నిబంధనల ప్రకారమే చేస్తాం



ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో లావాదేవీలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఇనాం ద్వారానే యార్డులో క్రయ, విక్రయాలు సాగుతున్నాయి. నిబంధనల ప్రకారం లైసెన్సు రెన్యూవల్ చేయాలంటే ఐదేళ్లు కాలపరిమితి ఇస్తాం. ఐదేళ్లల్లో రెండు సంవత్సరాలైనా సక్రమంగా లావాదేవీలు ఉండాలి. అలా లేకుంటే రద్దు చేస్తాం. లైసెన్సుదారులు నిబంధనలను పాటించాలి. తమపై నిర్లక్ష్యం అంటూ ఆరోపణలు చేయడం తగదు.

– రామ్మోహన్‌రెడ్డి, యార్డు సెక్రటరీ

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బుసినే విరుపాక్షి

చిప్పగిరి: నియోకవర్గ పరిధిలోని బాపురం, మొలగవల్లి, హత్తిబెళగల్ తదితర గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 35 కుటుంబాల వారు గురువారం వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినే విరుపాక్షి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, మల్లికార్జున, మంజునాథ, నాగరాజు, నరసప్ప, బసప్ప, రంగస్వామి, బసవరాజు, మద్దిలేటి, రమేష్, శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

హొళగుంద: ప్రజలకు చేసిన మేలే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అఖండ విజయం అందిస్తుందని, రాష్ట్రానికి వైఎస్ జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని పార్టీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి అన్నారు. గురువారం ఆయన తనయుడు చంద్రశేఖర్‌తో కలిసి ఎల్లార్తి శ్లేషావలి, షాషావలి దర్గాలను దర్శించుకున్నారు. వారికి దర్గా ఈఓ అబ్దుల్ రహిమాన్, పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. దర్గా నిర్వాహకులు ప్రత్యేక ఫాతెహాలు చేయించారు. అనంతరం విరుపాక్షి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించారని వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు దర్గన్న, ఎస్కే గిరి, ఈరన్న, చిన్నహ్యాట మల్లి, రామకృష్ణ, దొడ్డబసప్ప పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్ర క్రీడల పోటీలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి



మేకడోణ జట్టుకు క్రికెట్ కిట్ అందజేస్తున్న అధికారులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఆడుదాం ఆంధ్ర పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా క్రికెట్ పోటీలను పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 42 వార్డు సచివాలయాలకు చెందిన జట్లు పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల మైదానం, పురపాలక ఉన్నత పాఠశాల మైదానంలో పోటీలు జరుగుతున్నాయని, ప్రతి మైదానంలో 10 జట్లను ఆడిస్తున్నామన్నారు. ఆడుదాం–ఆంధ్ర కో ఆర్డినేటర్ నరసయ్య, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీలలో మండలంలోని మేకడోణ గ్రామం టీం విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ఎంపీడీఓ ప్రభాకర్, ఈఓపీఆర్డీ జనార్ధన్, ఎంఈఓ రామమూర్తి క్రికెట్ కిట్‌ను కానుకగా అందజేశారు. వారు మాట్లాడుతూ మండలస్థాయి క్రికెట్ పోటీలకు 18 జట్లు పేర్లు నమోదు చేసుకోగా కంబలదిన్ని, మేకడోణ జట్లు ఫైనల్ చేరుకున్నాయన్నారు. గురువారం జరిగిన ఫైనల్ పోటీల్లో మేకడోణ గెలుపొందింది. త్వరలో జరగబోయే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. గెలుపొందిన జట్టుకు ప్రభుత్వం నుంచి వచ్చిన క్రికెట్ కిట్టును బహుమతిగా అందజేసినట్లు పేర్కొన్నారు.

సీఎం సహాయ నిధి నుంచి సాయం మంజూరు



చంద్రశేఖర్ రెడ్డికి చెక్కు అందజేస్తున్న దృశ్యం

కోసిగి: మండలంలోని జంపాపురం గ్రామానికి చెందిన పల్లి చంద్రశేఖర్ రెడ్డి అనే వైఎస్సార్ సీపీ కార్యకర్త గుండెకు సంబధిత వ్యాధితో బాధపడుతూ హైదరబాద్ నిమ్స్‌లో ఆసుపత్రిలో చేరాడు. అత్యవసర ఆపరేషన్ చేయించాలని వైద్యులు తెలిపారు. విషయాన్ని బాధితుడి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీమోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి లోన్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) రూ.4లక్షల సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును గురువారం నిమ్స్ ఆసుపత్రిలో బాధితుడికి అందజేశారు. గతంలో కూడా బాధితుడికి ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా గుండె ఆపరేషన్‌కు ఎమ్మెల్యే సహకరించారు. మరోసారి గుండె నొప్పి రావడంతో సీఎం సహాయ నిధి నుంచి చెక్కు అందించడం పట్ల బాధితుడు సంతోషం వ్యక్తం చేసి ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలి

పెద్దకడబూరు : కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయ డిమాండ్ చేశారు. ఏఐకేఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో గురువారం రైతులతో కలసి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ రైతులు తమ అంగీకారం తెలపకుండానే వారిపై విద్యుత్ భారం మోపడానికే కేంద్ర ప్రభుత్వం బిల్లును తీసుకొచ్చిందని మండిపడ్డారు. అనంతరం ఏఈ సుబ్బారెడ్డికి వినతి పత్రం అందజేశారు. నాయకులు జాఫర్‌పటేల్, చంద్ర, రహిమాన్, మహమ్మద్ హుసేన్, రంగస్వామి, వెంకటరాముడు, వీరేష్, రైతులు పాల్గొన్నారు.

22న సీతారాముల శోభాయాత్ర

కోసిగి: ఈనెల 22వ తేదీన అయోధ్యలో భవ్య మందిరం ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని మండల కేంద్రంలో సీతారాముల శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ మండల సంయోజక ముకుంద కృష్ణమూర్తి, భజరంగ్ దళ్ మండల సంయోజక బొంపల్లి వెంకటేష్ తెలిపారు. గురువారం ముఖ్య నాయకులను కలిసి శోభాయాత్రలో పాల్గొనాలని కోరారు. 22న ఉదయం 7గంటల నుంచి రామాలయం నుంచి శ్రీ సీతారాముల ఉత్సవ మూర్తులతో ఆంజనేయ స్వామి ఆలయం వరకు శోభాయాత్ర సాగుతుందన్నారు. ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు శోభాయాత్రకు రూ.5,116 విరాళంగా అందించారు.

ఉద్యమ నిర్మాత నరసింహయ్య



నరసింహయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదోనిరూరల్: కర్నూలు జిల్లా సీపీఎం ఉద్యమ నిర్మాత, కార్మిక కర్షక పోరాటయోధుడు తెలకపల్లి నరసింహయ్య 5వ వర్ధంతి సందర్భంగా పట్టణంలో గురువారం సీపీఎం నాయకులు నిర్వహించారు. ముందుగా నరసింహయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీనియర్ నాయకుడు ఈరన్న, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, నాయకులు గోపాల్, వీరారెడ్డి, తిప్పన్న, రామాంజనేయులు, శ్రీనివాసులు, వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం కోసం, భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం అవిశ్రాంత పోరాటం చేసిన త్యాగధనుడని కొనియాడారు.

21న మహాదేవప్ప తాత ఆరాధన

ఆస్పరి: మండలంలోని నగరూరు గ్రామంలో వెలసిన మహాదేవప్ప తాత 36వ ఆరాధనోత్సవాలు ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. ఆరోజు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, గణపతి పూజ, పల్లకీ సేవ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం స్వామి వారి రథోత్సవం, భజన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి, నెరణికి తండా కొండల్లో గురువారం ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నాటుసారా స్థావరాలపై దాడులు చేపట్టారు. సారా తయారు చేసే స్థావరాలను గుర్తించి అక్కడ బిందెల్లో నిల్వ ఉంచిన 1,500 లీటర్ల బెల్లం ఊట, ఐదు లీటర్ల సారాతో పాటు బిందెలను ధ్వంసం చేశారు. నాటుసారా తయారీ, విక్రయించడం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాల్మీకులను ఎస్టీలో చేర్చాలి

ఆలూరు: వాల్మీకుల హక్కుల సాధనకై 10 రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన రిలే నిరహార దీక్షలు స్థానిక అంబేడ్కర్ కూడలిలో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ.. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని, ఇతర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. నాయకులు అర్జున్, సురేంద్ర, వరుణ్, క్రాంతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు భారీగా తరలిన జనం



జెండా ఊపి బస్సులను ప్రారంభించిన మనోజ్‌కుమార్‌రెడ్డి



రెండు బస్సుల్లో కౌతాళం నుంచి విజయవాడకు తరలివెళుతున్న కార్యకర్తలు, ప్రజలు

ఆదోనిటౌన్: బి.ఆర్.అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహం ప్రారంభోత్సవానికి గురువారం రాత్రి ఆదోని నియోజకవర్గం నుంచి 300కు పైగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల నేతలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి సామాజిక సమతా సంకల్ప సభకు తరలి వెళ్తున్న బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బస్సులు విజయవాడకు బయలుదేరాయి. ఐదు బస్సుల్లో 250 మంది, 10 కార్లలో వంద మంది దాకా తరలివెళ్లినట్లు మనోజ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా అత్యంత ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. పార్టీ పట్టణాధ్యక్షులు దేవా, నాయకులు, కార్యకర్తలు సన్నీ, తాయన్న, మమ్మత్తుస్వామి, ఉస్మాన్, కల్లుపోతుల సురేష్, క్రిష్ణమోహన్, ధర్మన్న పాల్గొన్నారు.

కౌతాళం: విజయవాడలో 206 అడుగులతో అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం ప్రారంభించనున్న నేపథ్యంలో కార్యక్రమంలో పాల్గొనేందుకు కౌతాళం నుంచి రెండు బస్సుల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు ప్రహ్లాదాచారి, సర్పంచ్ పాల్‌దినకర్, దాట్ల సుబ్బారాజు, ఎంపీడీఓ సుబ్బారాజు బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. మాజీ సర్పంచ్ అవతారం, నాయకులు రాఘవేంద్రరెడ్డి, భీమేష్, మాజీ ఎంపీటీసీ చౌదరిబసవ, మండల సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి, రాజ్‌అహ్మద్, గిరి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి నిధుల మంజూరు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి

కౌతాళం: మండలంలోని ఎరిగేరి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న బసవేశ్వరస్వామి దేవాలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి గ్రామ పెద్దలకు గురువారం రాంపురం గ్రామంలో అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి నిధుల కొరత ఉండడంతో విషయాన్ని గ్రామస్తులు తన దృష్టికి తీసుకురావడంతో టీటీడీ వారికి ప్రతిపాదనలు పంపగా వారు రూ.10లక్షలు మంజూరు చేశారు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.2లక్షలు ఇవ్వడంతో నిర్వాహకులకు అందజేశామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగపు కార్యదర్శి ప్రదీప్‌రెడ్డి, సర్పంచ్ గోవిందు, గ్రామ ఇన్‌చార్జి నీలకంఠరెడ్డి పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై చర్యలు

- బైండోవర్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించండి
- దీర్ఘకాలిక బైండోవర్ కేసులపై సమగ్ర విచారణ చేపట్టాలి
- సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ



పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయనశర్మ సూచించారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లోని పోలీసు అధికారులతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బైండోవర్ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బైండోవర్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నేరస్థులు, రౌడీలు, కేడీలు, డీసీలు, అనుమానితులు మంచి ప్రవర్తనతో మెలగాలని, వారితో పాటు వివిధ కేసుల్లో బైండోవర్ అయిన వారు బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డివిజన్‌లో 32 కేసుల్లో 295 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా దీర్ఘకాలికంగా బైండోవర్ కేసుల్లో మరణించిన వారు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారిపై సమగ్ర విచారణ చేపట్టి కేసులను క్లోజ్ చేయాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. డీఎస్పీ శివనారాయణస్వామి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సబ్ ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు



నాగలదిన్నె వంతెన వద్ద చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

నందవరం: వాహనదారులు అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో వంతెన వద్ద నిర్మిస్తున్న పోలీసు చెక్‌పోస్టును డీఎస్పీ పరిశీలించారు. అనంతరం ఎస్‌ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో వంతెన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. బ్రిడ్జిపై అసాంఘిక కార్యలాపాలు, వాహనాలలో అక్రమ రవాణాకు పాల్పడితే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. అక్రమ మద్యం, నగదు రవాణాను అరికట్టే నేపథ్యంలో తనిఖీలు చేపట్టామన్నారు. వాహనాలకు సరైన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవర్‌కు లైసెన్స్ ఉండాలని సూచించారు. కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

22న ఓటర్ల తుది జాబితా ప్రచురణ



అధికారులు, పార్టీల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: ఈనెల 22వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తామని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ తెలిపారు. గురువారం స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో స్థానిక సబ్‌కలెక్టర్ హాల్‌లో సబ్‌కలెక్టర్ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడతూ క్లెయిమ్స్ మరియు డిస్పోజల్స్ పూర్తి చేసి ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 22వ తేదీన ప్రచురిస్తామని చెప్పారు. ఇంటింటి సర్వే మరియు స్పెషల్ సమ్మరీ రివిజన్–2024 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా ఈనెల 22వ తేదీన పటిష్ఠమైన తుది ఓటరల జాబితాను రూపొందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఏఈఆర్‌వో, తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఏడీ పురుషోత్తం

ఆదోనిఅర్బన్: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉటుందని ఏడీ పురుషోత్తం తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కౌతాళం: ఈనెల 20వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ నర్సప్ప తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం నుంచి రాత్రి 8గంటల వరకు త్రీఫేస్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. కర్నూల్‌లోని 220 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు జరుగుతుండడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 6గంటల వరకు సరఫరా ఉంటుందని, రైతులు ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకొని పంటలకు నీటి తడులు ఇవ్వాలని సూచించారు.

పెద్దకడబూరు/కోసిగి: పెద్దకడుబూరు, కోసిగి మండలాల్లో శనివారం 12 గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈలు సుబ్బారెడ్డి, వీరేష్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ కర్నూల్ జిల్లా కేంద్రంలో 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమత్తుల కారణంగా ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.